# ఆర్థిక నైపుణ్యం

**మం**గదేశంలో అన్ని రకాల ఉత్పత్తులూ క్షీణించి డబ్బు ఉత్పత్తి పెరిగిపోయింది. రూపాయి విలువ పది పైసలకు దిగిందన్నారు. ఆ పదిపైసల విలువ చేసే రూపాయలన్నా ఉత్పత్తి చేసే శ్రామికుల వద్ద లేవు. వాళ్లకు మొదలు పనులే లేవు.

రూపాయి విలువ కనీసం ఇరవై పైసలకు పెంచటం ఎలాగా అని ఆర్థిక నిపుణులు చర్చించారు. రూపాయల చలామణీ హెచ్చుగా ఉన్నది. పనులున్న అదృష్టవంతులకు జీతం కన్న కరువుభత్యాలు హెచ్చుగా ఉంటున్నాయి.

"కరువు భత్యాలు ద్రవ్యోల్బణాన్ని పెంచుతున్నాయి. వాటిని బిగించాలి, కరువు భత్యం తీసెయ్యొద్దు. దాన్ని బిగించి, పనివాళ్ల పేర బ్యాంకుల్లో వేద్దాం. తరవాత వడ్డీతోసహా వాళ్లకే ఇయ్యొచ్చు. డబ్బు పొదుపుచేసినవాళ్లూ అవుతారు!" అన్నాడొక నిపుణుడు.

ఆర్థిక నైపుణ్యంలేని ఒక అజ్ఞాని, "కరువు భత్యం హెచ్చు ధలరకు జనం తట్టుకోవాలనేగదా ఇస్తాం? దాన్ని బిగదియ్యటంలో పాయింటేమిటి?" అని అడిగాడు.

ఎవరూ వినిపించుకోలేదు.

ఆర్థికమంత్రికి ఇంకా బ్రహ్మాండమైన ఆలోచన వచ్చింది. "పనివాళ్లందరి జీతాలూ ఆరు నెలలు తొక్కిపెట్టి, వాళ్ల ఎకౌంటులో బాంకులో వేస్తే రూపాయి విలువ నలభై పైసల దాకా పెంచవచ్చు" అన్నాడు.

అందరూ చప్పట్లు కొట్టారు. అది అమలు జరిగింది. సంవత్సరాంతంలో ఆర్థికమంత్రికి "ద్రవ్య కళాప్రపూర్ణ" బిరుదు ఇచ్చారు.

*ముద్రణ : యువ, ఫిబ్రవరి 1978*